జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం



భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం | 29 | డిసెంబర్ | 2024 ◆ పేజీలు : 5

## రామయ్యను దర్శించుకున్న హౌసింగ్ ఎండీ గౌతమ్



**భద్రాచలం, డిసెంబర్ 28 (ప్రజాజ్యోతి):**

భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానంలో స్వామివారిని రాష్ట్ర హౌసింగ్ ఎండీ వీపీ గౌతమ్ కుటుంబసమేతంగా శనివారం దర్శించుకున్నారు. తొలుత ఆయనకు ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ధ్వజస్తంభం వద్ద పూజలు నిర్వహించి గర్భగుడిలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు. ఆలయంలోని ఉప ఆలయాలైన శ్రీలక్ష్మీతాయారు, అభయాంజనేయస్వామి వార్లను దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఆలయ విశిష్టతను ఆయనకు వివరించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఉద్యోగులు, అర్చకులు పాల్గొన్నారు.





# మహిళా శక్తి క్యాంటిన్ ప్రారంభోత్సవం

**పాల్వంచ, డిసెంబర్28 (ప్రజా జ్యోతి):**

పాల్వంచ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో సత్యసాయి గ్రూప్ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు, డీసీఎంస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాస్, సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా పాల్గొన్నారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతు మహిళలను సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా, బలోపేతం చేయడానికి, ఈ మహిళా శక్తి క్యాంటీన్ లో దోహదపడతాయని అన్నారు, రాష్ట్రవ్యాప్తంగా ప్రజా ప్రభుత్వం మహిళా శక్తి క్యాంటీన్లను ఏర్పాటు చేస్తుందని తెలిపారు. ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం మహిళా అభ్యున్నతికి పెద్దపీట వేస్తుందని, గతంలో డ్వాక్రా మహిళా సంఘాల అక్కచెల్లెమ్మలకు 0% వడ్డీ రుణాలు అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వనిదేనని నూతనంగా ఏర్పడ్డ

మిగతా 2 లో...

## నేటి నుంచి నెహ్రూ కప్

భద్రాద్రికి తరలి రానున్న రాష్ట్ర నలుమూలల క్రీడాకారులు
నెహ్రూ కప్ ను విజయవంతం చేయండి
నెహ్రూ కప్ వ్యవస్థాపకులు తోటమల్ల బాలయోగి



**భద్రాచలం టౌన్, డిసెంబర్ 28 (ప్రజాజ్యోతి)**

భద్రాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఆదివారం నుంచి 29 వ నెహ్రూ కప్ తాళ్లూరి భారతీదేవి స్మారక అంతర్రాష్ట్ర ప్రైజ్ మనీ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం కానుంది. తాళ్లూరి పంచాక్షరయ్య ట్రస్ట్, ఐటిసి పి.ఎస్.పి.డి, బత్తినేని ప్రకాష్, డాక్టర్ పాల్ రాజ్ ఇంజనీరింగ్ కాలేజ్, పాకాల దుర్గాప్రసాద్ ల సౌజన్యంతో పట్టణ ప్రముఖుల సహకారంతో ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నెహ్రూ కప్ వ్యవస్థాపకులు తోటమల్ల బాలయోగి, వాతాడి దుర్గా అశోక్ లు తెలిపారు. 1994లో నెహ్రూ కప్ క్రికెట్ టోర్నమెంటును తోటమళ్ళ బాలయోగి భద్రాచలం, వాతాడి దుర్గా అశోక్ ప్రారంభించడం జరిగింది. మారుమూల ఏజెన్సీ ప్రాంతం భద్రాచలం పుణ్యక్షేత్రంలో భారతదేశ తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ పేరు మీదుగా ఈ టోర్నమెంట్ ప్రారంభించటం గమనార్హం. నాటి నుంచి నేటి వరకు నిరాటంకంగా

మిగతా 2 లో...

## యాగశాలలో రత్నాంగి కవచాలకు పూజలు





2 లో...

### అ.ని.శా. వలకు చిక్కిన..
# అవినీతి తిమింగలం

**దమ్మపేట, డిసెంబర్ 28 (ప్రజాజ్యోతి)**

దమ్మపేట మండల తహసిల్దార్ కార్యాలయంలో ప్రభుత్వ సర్వేయర్ గా పనిచేస్తున్న మేరుగ వెంకటరత్నం అనే ఉద్యోగిని లంచంతీసుకుంటుండగా శనివారం అవినీతి నిరోధక శాఖ అధికారుల వలకు చిక్కాడు. ఈ క్రమంలో మండల పరిధిలోని ఒక గ్రామానికి చెందిన రైతు ఎప్పటినుంచో సాగుచేసుకుంటున్న రైతు భూమి సర్వే నెంబర్ లు తప్పుగా ఉన్నాయని, వాటి మార్పు చేయాలని సదరు

మిగతా 2 లో...





# నల్ల బెల్లం, పటిక పట్టివేత

### అశోక్ లేలాండ్ ట్రాక్ స్వాధినం
### ఒక వ్యక్తి అరెస్ట్, మరొకరు పరారీ

**అశ్వాపురం, డిసెంబర్ 28, ప్రజాజ్యోతి**

ఆశ్వాపురం మండలం పిచ్చుకల తండా గ్రామానికి చెందిన బదావత్ కోటేశ్వర రావు, కొత్తగూడెం పెద్ద బజారుకు చెందిన సంజయ్ లడ్డ ఇద్దరు కలిసి నాటుసారా తయారీకి వాడు ముడి పదార్థాలు అయినా బెల్లం, పటికలు తమ దగ్గర ఉన్న ట్రక్ లో కొత్తగూడెం నుంచి తీసుకు వచ్చి పిచ్చుకల తండ గ్రామ శివారున అటవీ



ప్రాంతంలో బట్టీ పెట్టి నాటుసారా తయారు చేసి చుట్టు ప్రక్కల గ్రామాలలో అమ్మకాలు జరుపుతున్నారాన్న కచ్చితమైన సమాచారం మేరకు కొత్తగూడెం ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ మరియు మణుగూరు ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది దాడులు నిర్వహించి

మిగతా 2 లో...

## నల్ల బెల్లం, పటిక పట్టివేత

(మొదటి పేజీ తరువాయి...)

(108) కేజీల బెల్లం, (05)కేజీల పటిక, (02) లీటర్ల నాటుసారా, అశోక్ లేలాండ్ ట్రక్, ఒక మొబైల్ ఫోన్ స్వాధీన పర్చుకొని, (100) లీటర్ల బెల్లం పానకం సంఘటన స్థలంలో ధ్వంసం చేసినట్లు, వారివురి మీద కేసు నమోదు చేసినట్లు మణుగూరు ఎక్సైజ్ సీ ఐ రాజిరెడ్డి తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్.ఐ లు గౌతమ్, కిషోర్ బాబు సిబ్బంది రామకృష్ణ గౌడ్, హాబీబ్ పాషా, గురవయ్య, సుమంత్, రమేష్, ప్రసన్న, శ్రీను, అమల పాల్గొన్నారు.

## అవినీతి తిమింగలం...

(మొదటి పేజీ తరువాయి...)

అవినీతి సర్వేయర్ 50వేలు లంచం డిమాండ్ చేస్తూ, రోజు తహసిల్దార్ కార్యాలయానికి పిలుస్తూ వేధిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో విసిగిపోయిన రైతు సర్వేయర్ పై అవినీతి నిరోధక శాఖ కార్యాలయానికి ఫిర్యాదు చేయగా, ఆ శాఖ డీఎస్పీ వై.రమేష్ఆధ్వర్యంలో చాకచక్యంగా సర్వేయర్ కు వలపన్ని పట్టుకున్నామని అ.ని.శా అధికారులు తెలియజేశారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తహసిల్దార్ కార్యాలయంలో తనిఖీలు చేపట్టి, అవినీతి కి పాల్పడి ప్రజలను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరికలు చేసిన రెండు రోజులు కాకుండానే ప్రభుత్వ సర్వేయర్ లంచం డబ్బులతో అవినీతి నిరోధక శాఖ కు దొరకడం సిబ్బంది మంత్రి మాటను కూడా పెడచెవిన పెట్టడం వారి లెక్కలేని తనాన్ని సూచిస్తుందని మండల ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఇటువంటి అవినీతి అధికారులకు బుద్ధివచ్చేలా సర్వేయర్ వెంకటరత్నానికి చట్టం తరపున కఠినంగా శిక్షించి, ఉద్యోగం నుండి బర్తరఫ్ చేయాలని మండల ప్రజలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఎన్నో కష్టసుఖాలకు ఓర్చి, రూపాయి, రూపాయి కూడబెట్టుకొని ఇల్లు కట్టుకోవడానికో, సాగు కోసమో భూమిని కొనుక్కుంటే ఇటువంటి అవినీతి అధికారులు తమ హక్కులకు పాతరేస్తూ లంచాల పేరుతో తమను మానసిక క్షోభను గారి చేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు.

## నేటి నుంచి నెహ్రూ కప్

(మొదటి పేజీ తరువాయి...)

కొనసాగుతూ 29వ సంవత్సరం కూడా నెహ్రూ కప్ క్రికెట్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. భద్రాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానమును ఇందుకోసం అందంగా తీర్చిదిద్దారు. గ్రౌండ్ లో నలుదిక్కుల షామీయనాలు ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా పిచ్ నిర్మాణం చేశారు. సైడ్ వాల్ స్క్రీన్ల మధ్య ఈ టోర్నమెంట్ జరగనుంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్ ఘడ్ రాష్ట్రాల నుంచి మొత్తం 21 జట్లు ఈ టోర్నమెంట్ లో పాల్గొననున్నాయి. స్థానికుల యొక్క సహాయ సహకారాలతో ఈ టోర్నమెంటును నిర్వహిస్తున్నారు. భారతదేశంలోనే తొలి ప్రధాని నెహ్రూ పేరు మీదుగా ఇన్ని సంవత్సరాలు టోర్నమెంట్ నిర్వహించిన చరిత్ర లేదని, ఆ ఘన కీర్తి భద్రాచలంలో నిర్వహిస్తున్న నెహ్రూ కప్ కే దక్కిందని నెహ్రు కప్ వ్యవస్థాపకులు తోటమల్ల బాలయోగి, వాతాడి దుర్గా అశోకులు వెల్లడించారు. ఈ టోర్నమెంట్ నిర్వహణ ద్వారా ఎంతోమంది యువతి, యువకులు క్రికెట్ లో రాణించి ఉన్నత స్థానాలను అధిరోహించారని తెలిపారు. నెహ్రూ కప్ క్రికెట్ టోర్నమెంట్ విజయవంతానికి అందరూ కృషి చేయాలని, నెహ్రూ కప్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభ వేడుకకు భద్రాచలం శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకటరావు, తాళ్లూరి పంచాక్షరయ్య ట్రస్ట్ సభ్యులు, ఐటీసీ అధికారులు, పట్టణ ప్రముఖులు తదితరులు హాజరు కానున్నారని, ఈ వేడుకకు పట్టణ ప్రజలు, క్రికెట్ అభిమానులు తదితరులు తరలి రావాలని నెహ్రూ కప్ టోర్నమెంట్ గౌరవ సలహాదారులు ఎస్.కే అజీం, నెహ్రూ కప్ అధ్యక్షులు అట్లూరి శ్రీధర్, ప్రధాన కార్యదర్శి దాట్ల శ్రీనివాసరాజు, కన్వీనర్ ఎస్ కే సలీం, కోశాధికారి కుంచాల సదానందం, ఉపాధ్యక్షులు గుమ్మలూరు శ్రీనివాస్, సహాయ కార్యదర్శి ఎం నాగార్జున, నిర్వాహక కమిటీ సభ్యులు పూనెం ప్రదీప్ కుమార్ తదితరులు వెల్లడించారు.

## రత్నాంగి కవచాలకు పూజలు

### –ఆలయ ఈవోకు అప్పగించిన దాతలు

**భద్రాచలం, డిసెంబర్ 28 (ప్రజాజ్యోతి):**

భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో హైదరాబాద్ కు చెందిన ఉభయదాతలు స్వామివారికి బహుకరించిన రత్నాంగి కవచాలకు శనివారం ఆలయ అర్చకులు యాగశాలలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి సంప్రోక్షణ కార్యక్రమాలను పూర్తిచేశారు. పూజల అనంతరం ఉభయదాతలు పిన్నమనేని బాలమురళీకృష్ణ, శాంతి దంపతులు, కుటుంబసభ్యులు రూ. 40 లక్షల విలువైన 51వేల రత్నాలు కలిగిన రత్నాంగి కవచాలను ఆలయ ఈవో రమాదేవికి అప్పగించారు. స్వామివారికి ఇప్పటికే స్వర్ణకవచం, ముత్యాల కవచం ఉండగా ఇప్పుడు రత్నాల కవచం రావడంతో వారంలో ఒకరోజు స్వామివారు రత్నాంగి కవచాలతో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఆదివారం అభిషేకం అనంతరం స్వామివారికి ఈ కవచాన్ని ధరింపచేయనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులతో పాటు ఆలయ ఉద్యోగులు, భక్తులు పాల్గొన్నారు.

## మహిళా శక్తి క్యాంటిన్ ప్రారంభోత్సవం

(మొదటి పేజీ తరువాయి...)

ప్రజా ప్రభుత్వం మహిళా అభ్యున్నతికి తొలి ప్రాధాన్యతనిస్తూ మహాలక్ష్మి, గృహలక్ష్మి లాంటి పథకాలతో మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. రాష్ట్రంలో మహిళా సంఘాల మహిళా అభ్యున్నతికి రాష్ట్ర ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, అధికారులు, అనధికారులు, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# ఇపి ఆపరేటర్ ల సమస్యలు పరిష్కరించాలి: హెచ్ ఎం ఎస్

**కొత్తగూడెం సింగరేణి / డిసెంబర్28, (ప్రజాజ్యోతి):**



ఇపి ఆపరేటర్లకు ప్రతీ రెండు సంవత్సరాలకు ప్రమోషన్లు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని హెచ్ఎంఎస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఆంజనేయులు అన్నారు. శనివారం సిఎండి డైరెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా కాలం నుండి ఈపీ ఆపరేటర్లుగా పని చేస్తూ సంస్థ ఉత్పత్తి ఉత్పాదకతలో ప్రముఖ పాత్ర వహించే ఆపరేటర్లను ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి గ్రేట్ ప్రమోషన్ ఇవ్వాల్సి ఉండగా ప్రమోషన్ ముందు నామమాత్రపు టెస్టులు నిర్వహించి ప్రమోషన్ డి గ్రేడ్ నుంచి సిగ్రేడ్ కి సీగ్రేడ్ నుంచి బిగ్రేడ్ కి కల్పించే పద్ధతిని విరుద్ధంగా ఆపరేటర్లను మానసికంగా ఆర్థికంగా ఇబ్బందులకు గురి చేస్తూ ప్రమోషన్ రాకుండా ఫెయిల్ చేయడానికి నిరసిస్తూ వారి సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎంఎస్ పలు దఫాలుగా మేనేజ్మెంట్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని తెలిపారు. అందులో భాగంగానే ఈపి ఆపరేటర్లకు ఉన్న సమస్యలను వివరిస్తూ ఫెయిల్ అనే సాకు సాకు చూపిస్తూ ప్రమోషన్ నిలుపుదలను చేయడం సరి కాదని తెలిపారు. ఆపరేటర్లు చాలా కాలం నుండి ఏ గ్రేడ్ ఆపరేటర్లు నడపవలసిన వెహికల్స్ ని నడుపుతూ వారి డ్యూటీ ని క్రమశిక్షణతో నిర్వహించి పలుమార్లు ఉత్తమ కార్మికులు గా గుర్తించబడి అవార్డులు పొందిన కార్మికులను ఫెయిల్ చేయడం సరైనది కాదని అన్నారు. ఈ పద్ధతిని విడనాడి ఎగ్జామ్ కండక్ట్ చేసి ఎప్పటి నుంచి అయితే వారికి రావాల్సిన డిసిగ్నేషన్ ఆ సమయం నుంచే ఎఫెక్ట్ అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని, ఆపరేటర్లకు న్యాయం చేయాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన అధికారులు అతి త్వరలో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ సమావేశంలో హెచ్ఎంఎస్ జనరల్ సెక్రెటరీ రియాజ్ అహ్మద్, ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఆంజనేయులు, బ్రాండ్ సెక్రెటరీ ఆసిఫ్, ఏపీ ఆపరేటర్లు, హెచ్ఎంఎస్ నాయకులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**ములకలపల్లి, డిసెంబర్ 28, ప్రజాజ్యోతి:**

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన ములకలపల్లి పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు అయ్యింది. ఎస్సై కిన్నెర రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్ర పునా కు చెందిన అత్తర్వ అభయ్ భవర్తి 25 బొలెరో పికప్ వాహనానికి క్లినర్ గా పనిచేస్తున్నాడు. ఈనెల 26న ముంబైనుంచి కొత్తగూడెంకు లోడ్ తీసుకువచ్చి, తిరుగు ప్రయాణంలో రాజమండ్రి వెళుతుండగా కొత్తగంగారం అటవీ ప్రాంతంలో బొలెరో వాహనం అదుపుతప్పి చెట్టుకు ఢీ కొట్టింది. ప్రమాదంలో అభయ్ కు తీవ్ర గాయలవడంతో చికిత్స నిమిత్తం అశ్వారావుపేట ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అభయ్ మృతిచెందాడు. మృతుని తండ్రి అభయ్ వసంత్ భవర్తి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## సమగ్ర శిక్షా ఉద్యోగుల గాందేయ మార్గంలో తలకు తెల్ల టోపీ ధరించి నిరసన

**కొత్తగూడెం /డిసెంబర్ 28, (ప్రజాజ్యోతి):**



కేజీబీవీలలో ఈరోజు వరకు రోజుకు ఇద్దరు టీచర్ల చొప్పున బాలికల సంరక్షణార్థం విధులు నిర్వహిస్తున్నప్పటికి ప్రభుత్వ అధికారులు రాష్ట్రంలోని అన్ని కేజీబీవీలకు స్కూల్ అసిస్టెంట్ స్థాయి ఉపాధ్యాయినీలను ఇన్చార్జిలుగా నియమించడంతో కేజీబీవీలకు వెళ్లే ఇద్దరు టీచర్లు కూడా రేపటినుండి విధులకు హాజరుకారని, ఈరోజు (శనివారం) నుంచి బాలికల సంరక్షణతో మాకు ఎలాంటి సంబంధాలు లేవని సమగ్ర శిక్ష ఉద్యోగులు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం వెంకటేశ్వర చారి కి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈనెల కేజీబీవీలకు కావాల్సిన సరుకులకు ఇండెంట్ పెట్టలేదని బియ్యం ఎంత కావాలో అనే ప్రపోజల్ కూడా కేజీబీవీ ల స్పెషల్ ఆఫీసర్లు డిఈఓ కి విషయాన్ని తెలియపరిచారు. సరుకులు రాకపోతే వంట చేయలేరని అలాగే బియ్యం లేకపోయినా వంట చేయడం కుదరదని దానికి మేమేం చేయలేమని తెగేసి చెప్పారు. మేము శాంతియుతంగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వ అధికారులు మొండి వైఖరి ప్రదర్శిస్తూ స్పెషల్ ఆఫీసర్ల స్థానం లో ఉపాధ్యాయులను కేజీబీవీ లలో ఇన్చార్జిలుగా పంపడంతో మా టీచర్లను ఇంకెందుకు అక్కడ పంపించాలని విద్యార్థుల సంరక్షణ ఇంకెందుకు మేము ఎందుకు చూడాలని వారికి ఇక నుండి పూర్తి బాధ్యత ప్రభుత్వమే వహించాలని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు తెలిపారు. ఇంత దాకా వచ్చాక ఎట్టి పరిస్థితుల్లో సమ్మె విరమించబోమని తప్పనిసరి పరిస్థితుల్లో మాకు జీవో ఇచ్చి హామీ నిలబెట్టుకుంటే గాని సమ్మె విరమణ చేయమని తెగేసి చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మోహన్, చందు మహిళా అధ్యక్షురాలు ఏం తులసి, జిల్లాలోని అన్ని కేజీబీవీల స్పెషల్ ఆఫీసర్లు అకౌంటెంట్లు సోని, రమ, లక్ష్మి ఇతరులు పాల్గొన్నారు.

# అంతటి దుఃఖంలోనూ ఆదర్శంగా నిలిచారు

### నేత్ర దానం చేసి వేరొకరికి వెలుగులు పంచాడు

### పేరులోనే కాదు ఆచరణలోను దేవుడే

### అంత్యక్రియలు జరిపిన చిన్నారి... శోకసంద్రమైన గ్రామం

**ములకలపల్లి, డిసెంబర్ 28, ప్రజాజ్యోతి:**








ఆ కుటుంబానికి ఊహించని కష్టం, మృత్యు రూపంలో అంతటి దుఃఖం లోనూ ఆ కుటుంబం చేసిన పని పలువురికి ఆదర్శంగా నిలిచింది. వివరాల్లోకి వెళితే మండలంలోని జగన్నాధపురం గ్రామంలో అయ్యప్ప సెల్ పాయింట్ నిర్వాహకుడు గోపవరపు అయ్యప్పస్వామి 34సం. అనారోగ్యం తో శుక్రవారం మృతిచెందారు. కుటుంబ సభ్యుడు చనిపోయి దుఃఖంలో ఉన్న ఆ కుటుంబం నేత్రదానం చేసి ఆదర్శంగా నిలిచి మరొకరి జీవితంలో వెలుగులు నింపారు. ఆ కుటుంబ సభ్యులు, అయ్యప్పస్వామి బాబాయి సత్తుపల్లి లయిన్స్ క్లబ్ సభ్యులు మాధురి మధు సూచన మేరకు కుటుంబ సభ్యులు నేత్రదానం చేయటానికి ముందుకు వచ్చారు. డాక్టర్ అగ్రవాల్స్ ఐ హాస్పిటల్ కొత్తగూడెం బృందం సభ్యులు విష్ణు, ప్రవీణ్ నాయక్ లు శుక్రవారం రాత్రి అయ్యప్ప స్వామి నేత్రాలను సేకరించి కుటుంబ సభ్యులకు ధృవీకరణ పత్రం అందజేశారు. పుట్టెడు దుఃఖంలో సైతం ఉన్నతంగా ఆలోచించిన కుటుంబ సభ్యులను పలువురు అభినందించారు. అయ్యప్పకు భార్య విజయ లక్ష్మి, కుమార్తె లు కుష్మిత, పూజిత, తల్లి వర లక్ష్మీలు ఉన్నారు.

### అంత్యక్రియలు నిర్వహించిన చిన్నారి తల్లి...

అయ్యప్పస్వామి కి తండ్రి గత ఆరునెలల క్రితం మృతిచెందగా, తన అన్నయ్య అందుబాటులో లేకపోవడంతో తలకొరివి సైతం కుమార్తె కుష్మిత తో కుటుంబ సభ్యులు గ్రామస్తులు నిర్వహించారు.. అంతటి చిన్నారి తండ్రి అంత్యక్రియలు నిర్వహించడంతో గ్రామం యావత్తు శోకసంద్రంలో మునిగిపోయింది.

# ఇందిరమ్మ గృహాల మంజూరులో సర్వేను వేగవంతం చేయాలి

**పాల్వంచ,డిసెంబర్ 28 (ప్రజాజ్యోతి ):**



తెలంగాణా ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం చేపడుతున్న ఇందిరమ్మ పక్కా గృహాల మంజూరులో సర్వే అధికారులు సర్వేను వేగవంతం చేయాలనీ రాష్ట్ర మార్కెఫెడ్ డైరెక్టర్, డిసిఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాస రావు అన్నారు,ఈ మేరకు శనివారం పాల్వంచ మున్సిపల్ కార్యాలయంలో కొత్వాల తోపాటు కాంగ్రెస్ నాయకులు కమీషనర్ కె సుజాత ను కలిసి చర్చించారు,ఈసందర్భంగాకొత్వాల మాట్లాడుతూకాంగ్రెస్ప్రభుత్వం ఎన్నికలవాగ్ధానాల్లోఇచ్చిన పేదలకు 5లక్షలతోఇంటినిర్మాణానికిసాయంహామీ మేరకు ప్రజాపాలన సభలలో దరఖాస్తులు స్వీకరించిందన్నారు. మంజూరు విషయంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యంకలగకుండాసర్వేటీంచర్యలు చేపట్టాలని కొత్వాల అన్నారు, లబ్ధిదారులు ఆందోళన చెందవద్దు కొత్వాలప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న ప్రతి లబ్ధిదారుని వివరాలు సేకరించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారనీ,సర్వేలో ఆలస్యమైనా ఆందోళన చెందవద్దనీ కొత్వాల అన్నారు. లబ్ధిదారుని ఇంటి స్థలంకు సంబంధించిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ లేకున్నా సాదాబైనామా,ఎగ్రీమెంట్ డాక్యుమెంట్లతోమంజూరుచేసేలాఅధికారులను కోరామన్నారు, దరఖాస్తుదారు అడ్రస్ దొరకక పోయినా,దానిపై విచారించి ప్రతి ఒక్క దరఖాస్తును సర్వే చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలనికొత్వాలఅన్నారు,ఈసమావేశంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జాలే జానకిరెడ్డి,( ఎల్ డి ఎం)కోఆర్డినేటర్ బద్ది కిషోర్, మాజీ జడ్పీటీసీ సభ్యులు యర్రంశెట్టి ముత్తయ్య,సొసైటీ డైరెక్టర్ కనగాల నారాయణ,కాంగ్రెస్ నాయకులు బాలినేని నాగేశ్వరరావు,కందుకూరి రాము,పైడిపల్లి మహేష్,కాపా శ్రీను,చాంద్ పాషా,ఉండేటి శాంతివర్ధన్,మాలోత్ కోటి నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# పాదర్శకంగా మోడల్ మార్కెట్ గదులు కేటాయింపు





**ఇల్లందు, డిసెంబర్ 28, ప్రజాజ్యోతి:**

మోడల్ మార్కెట్ గదులను పాదర్శకంగా కేటాయించడం జరుగుతుందని ఎమ్మెల్యే కోరం కనకయ్య స్పష్టం చేశారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కూరగాయల వ్యాపారస్తులందరికి కింద ఫ్లోర్ గదులు కేటాయించనున్నట్లు తెలిపారు. వ్యాపారస్తులకు ఎలాంటి నష్టం కలుగకుండా అతి తక్కువ కిరాయి కేటాయించడం జరుగుతుందనితెలిపారు.ఇల్లందుమున్సిపాలిటీపరిధిలోఎక్కడకూడాకూరగాయలవ్యాపారాలు జరగద్దని ఒక్క మోడల్ మార్కెట్ నుండి జరిగేందుకు చర్యలు తీసుకుంటామనితెలిపారు.కిందఫ్లోర్ రూ. 2000, పైనఫ్లోర్ రూ. 1500కిరాయినిర్ణయించినట్లు పేర్కొన్నారు. రెండు రోజులలో షాపులకు లాటరీ పద్ధతిలో కేటాయించడం జరుగుతుందన్నారు. అనంతరం ఇటీవల జాతీయస్థాయిలో ఢిల్లీలో అవార్డు అందుకున్న ఇల్లందు మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ ను ఎమ్మెల్యే శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, కమిషనర్ సిహెచ్. శ్రీకాంత్, ఇల్లందు మున్సిపల్ మేనేజర్ అంకు షావలి, ఆర్ఐ శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిలర్లు అంకెపాక నవీన్ కుమార్, సయ్యద్ ఆజామ్, వ్యాపారి ఎస్. కె. జానీ, నాయకులు ఎర్ర ఈశ్వర్, వాసు తదితరులు పాల్గొన్నారు.

# అంకితభావంతో ముందుకెళ్లాలి

### ఉమ్మడి ఖమ్మం జిల్లా పోస్టల్ ఎస్పీ వీరభద్రస్వామి

**కొత్తగూడెం కలెక్టరేట్, డిసెంబర్ 28 (ప్రజాజ్యోతి ):**



స్థానిక పాల్వంచ పోస్ట్ ఆఫీస్ కార్యాలయం నందు శనివారం సాయంత్రం జరిగిన పోస్టల్ సిబ్బంది సమావేశంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా పోస్టల్ ఎస్పీ వి. వీరభద్రస్వామి పాల్గొని మాట్లాడారు. ఈసమావేశంలో పాల్వంచ సబ్ డివిజన్ పరిధిలోని గ్రామీణ తపాలా ఉద్యోగులు పాల్గొన్నారు. వారిని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. మారుతున్న కాల పరిస్థితులకు అనుగుణంగా పోస్టల్ శాఖ తీసుకొస్తున్న మార్పులను గ్రామీణస్థాయిలో ప్రజలకు వివరించి పోస్టల్ శాఖ ద్వారా అందిస్తున్న పథకాలను వారికి చేరువ చేయాలని కోరారు. ప్రతి ఉద్యోగి సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉన్నప్పుడే మనము అనుకున్న లక్ష్యాల్ని సాధించగలమని చెప్పారు. ముఖ్యముగా తక్కువ ప్రీమియంతో అందే జీవిత బీమా పథకాలకు సంబంధించి ప్రజలను చైతన్యం చేయాలని ఆయన సూచించారు ద్వారా మనము గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు పరోక్షంగా సేవను అందించిన వారు అవుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ సబ్ డివిజన్ ఇన్స్పెక్టర్ యం.వీరన్న, ఐపిపిబి మేనేజర్ సంజయ్, మెయిల్ ఓవర్సీస్ దుర్గాప్రసాద్, పాల్వంచ సబ్ పోస్ట్ మాస్టర్ నాగమణిషా, బ్రాంచి పోస్ట్మాస్టర్ బండి ఎల్లారావు తిలక్, రామారావు, సిద్దయ్య తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# అయ్యప్ప,అంజన్న స్వాముల ఇరుముడి కార్యక్రమంలో పాల్గొన్న కోరం సురేందర్

**టేకులపల్లి, డిసెంబర్ 28,ప్రజాజ్యోతి :**

మండలంలోని సూర్య తండ, చంద్రు తండా గ్రామంలోని ఎంతో నిష్టతో భక్తితో 41 దినముల దీక్షను పూర్తిచేసుకుని అయ్యప్ప స్వాములు , ఆంజనేయస్వాములు ఇరుముడి కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ నాయకులు కోరం సురేందర్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో దరావత్ హరి,భూక్యా రాంజీ,ఇతర స్వాములు మరియు నాయకులు వీరభద్రమ్,ధర్మయ్య,మాలోత్ బావ్ సింగ్, హుస్సేన్, భద్రు,బానోత్ రవి,నర్సింగ్ సుదీప్ తదితరులు పాల్గొన్నారు.



# కేక్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవంలో పాల్గొనన్నా ఎమ్మెల్యే



**పాల్వంచ,డిసెంబర్28(ప్రజాజ్యోతి ):**

పాల్వంచలో అంబేద్కర్ సెంటర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన కేక్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ,కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు తోపాటు కొత్వాల ప్రారంభించారు,ఈ సందర్భంగా కేక్ ఫ్యాక్టరీ లో వినియోగదారులకు నాణ్యమైన,రుచికరమైన పదార్ధాలను అందించేలా చూడాలన్నారు, సామాన్యులకు సైతం ధరలు అందుబాటులో వుండాలన్నారు,ఈ కార్యక్రమంలో నిర్వాహకులు వాంకోడోత్ నర్సింహారావు, వాంకోడోత్ గోపి,మాజీ జడ్పీటీసీ సభ్యులు యర్రంశెట్టి ముత్తయ్య,సిపిఐ నాయకులూ బాగం హేమవంతరావు,సాబీర్ పాషా, కాంగ్రెస్ నాయకులు కందుకూరి రాము,పైడిపల్లి మహేష్,ఉండేటి శాంతివర్ధన్, మాలోత్ కోటి నాయక్, బానోత్ బాలూ నాయక్,బాదావత్ సామా నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# దేశంలో ఆర్థిక సంస్కరణలు చేసిన మన్మోహన్ సింగ్



**ఇల్లందు, డిసెంబర్ 28, ప్రజాజ్యోతి:**

దేశంలో ఆర్థిక సంస్కరణలు చేసిన మహోన్నత వ్యక్తి మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అని ఎమ్మెల్యే కోరం కనకయ్య కొనియాడారు. శనివారం మున్సిపల్ పరిధిలోని కొత్త బస్టాండ్ వద్ద 1, 2, 3 వార్డు కమిటీల ఆధ్వర్యంలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ సంతాప సభ నిర్వహించారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ అభ్యున్నతి, అభివృద్ధికి దేశా నిర్దేశం చేసిన దర్శనికుడు అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దొడ్డ డానియల్, యండి. జాఫర్, జిల్లా నాయకులు మడుగు సాంబమూర్తి, బోళ్ళ సూర్యం, చిల్లా శ్రీనివాసరావు, ఇల్లందు మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ యదలపల్లి అనసూయ, 3వ వార్డు కౌన్సిలర్లు కొక్కు నాగేశ్వరావు, వార రవి, ఐఎన్టియుసి ఉపాధ్యక్షుడు జె. వెంకటేశ్వర్లు, నాయకులు పింగళి నరేష్, నీలం రమేష్,గుండంపల్లి సతీష్,వచ్చా వెంకన్న,జెట్టి కిషోర్,సూర్యప్రకాష్,ఎస్.కె. సలీమ్, రాజేందర్, ఎస్.కె. పాషా దళితరత్న మేకల శ్యామ్ మాదిగ, గాలిపల్లి స్వరూప, చిల్లా భారతి, వరలక్ష్మి, నిర్మల, అనిత తదితరులు పాల్గొన్నారు.

# మృతురాలి కుటుంబానికి పరామర్శ



**టేకులపల్లి, డిసెంబర్28, ప్రజాజ్యోతి:**

మండలంలోని కోయగూడెం పంచాయతీ గంగాపురం గ్రామానికి చెందిన కణతాల సీతమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో భౌతికయానికి నివాళులర్పించి వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుని ప్రార్ధిస్తూ కుటుంబాన్ని స్థానిక శాసనసభ్యులు కోరం కనకయ్య పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కోయగూడెం మాజీ సర్పంచ్ ఉమా , అంజయ్య,మన్నెం నరసింహారావు, సమ్మయ్య గ్రామస్తులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ అంతరాయం

**భద్రాచలం టౌన్, డిసెంబర్ 28(ప్రజాజ్యోతి )**

భద్రాచలం పట్టణంలో ఆదివారం ఉదయం 9గంటల నుండి 11:00గంటల వరకు సబ్ స్టేషన్ లో మెయింటనన్స్ కారణంగా భద్రాచలం సబ్ స్టేషన్ పరిది లోవున్న ఏరియాలకు విద్యుత్ అంతరాయం కలుగునని విద్యుత్ శాఖఅధికారులు తెలియజేశారు. భద్రాచలం పట్టణ వినియోగదారులు అందరు సహకరించగలరు కోరుకున్నారు.

## ఎస్ ఐను సన్మానించిన అనిల్ నాయక్

### శాంతి భద్రతల పటిష్టం చేస్తారని ఆకాంక్ష



**జూలూరుపాడు, డిసెంబర్ 28(ప్రజా జ్యోతి )**

జూలూరుపాడు మండల పోలీస్ స్టేషన్ ఎస్ఐగా పదవీ బాధ్యతలు చేపట్టిన బాధావత్ రవి ని మర్యాదపూర్వకంగా స్టేషన్లో కలిసి శాలువాతో సన్మానించిన బేతాలపాడు గ్రామపంచాయతీకి చెందిన జూలూరుపాడు మండల కాంగ్రెస్ మాజీ యూత్ అధ్యక్షుడు అనిల్ నాయక్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలను పటిష్టం చేయాలని నిషేధిత మత్తు వస్తువుల విక్రయాలు జరగకుండా చూడాలని ముఖ్యంగా పశువుల దొంగతనాల అరికట్టాలని సంఘ వ్యతిరేక శక్తులపై కఠినంగా వ్యవహరిస్తారని ఆకాంక్షించారు . ఈ కార్యక్రమంలోబేతాళపాడు మాజీ ఉపసర్పంచ్ గూగులోత్ మోహన్ నాయక్ బానోతు లక్ష్మణ్ బట్టు రామకృష్ణ బట్టు రాజు లేగల మల్లికార్జున్ గూగులోత్ భాస్కర్ నాయక్. ఉన్నారు.

## తెలంగాణ పీపుల్స్ మూమెంట్ గాన కోకిల అవార్డు గ్రహీత బొమ్మెర జగన్ మోహన్

**టేకులపల్లి, డిసెంబర్ 28, ప్రజాజ్యోతి :**



సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో ఉత్తర తెలంగాణ పీపుల్స్ మూమెంట్ గాన కోకిల అవార్డు గ్రహీత బొమ్మెర జగన్మోహన్ కు మాజీ ఎమ్మెల్యే చాడా వెంకటరెడ్డి, సీపీఐ సిద్దిపేట పట్టణ నాయకులు సింగ్ చేతుల మీదుగా శనివారం గాన కోకిల అవార్డు అందుచేశారు. మాజీ ఎమ్మెల్యే చాడా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సాధనలో కవులు, కళాకారుల పాత్రగొప్పది ఉద్యమాన్ని ముందుకు తీసుకెల్లిన ఘనత పాటదేనని వారు అన్నారు. తెలంగాణ ఉద్యమంలో కళాకారులు క్రియాశీలకంగా ఆంధ్ర వలస పెత్తందారుల దోపిడి గురించి తెలంగాణ మారుమూల గ్రామలకు,దేశ రాజధాని వరకు వారి పాటలద్వారా సాహిత్యం ద్వారా ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర అవతరణ ఆవశ్యకతను వివరించారు, ప్రజలను ఉద్యమ దిశగా నడిపించిన తెలంగాణ కళాకారులను సన్మానించాల్సిన అవసరం బాధ్యత ఎంతైనా మనపై ఉంది అని వారు అన్నారు, ఈ కార్యక్రమంలో తెలంగాణ కళాకారులు సాఖి, మెంతేన కొండలరావు ఉమ్మడి ఖమ్మం జిల్లా నుండి సుమారుగా 50మంది కళాకారులు పాల్గొన్నారు.

## 9వ రోజు బతుకమ్మలతో సీఆర్టీల నిరసన

**భద్రాచలం, డిసెంబర్ 28 (ప్రజాజ్యోతి ):**

గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాలల కాంట్రాక్టు ఉపాధ్యాయులు భద్రాచలం ఐటీడీఏ కార్యాలయం ఎదుట చేపడుతున్న నిరవధిక సమ్మెలో 9వ రోజు శనివారం బతుకమ్మలతో నిరసన వ్యక్తం చేశారు. ఐటీడీఏ కార్యాలయం ఎదుట జిల్లా అధ్యక్షులు సక్రం, ప్రధాన కార్యదర్శి వీరన్నల ఆధ్వర్యంలో సీఆర్టి ఉపాధ్యాయులు బతుకమ్మలను ఎత్తుకుని ఆడిపాడి సమస్యలు పరిష్కరించాలని నిరసన తెలిపారు. సమ్మెకు ఎంఆర్పీఎస్ అధ్యక్షులు రమణయ్య, మిరియాల నర్సింహారావు, రామారావు, శ్రీనివాస్ లు మద్దతు పలికి సీఆర్టి ఉపాధ్యాయులకు మద్దతుగా నిలిచారు. 8 డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించకపోతే నూతన సంవత్సరంలో అమరణదీక్షకు కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని, హైకోర్టు ఇచ్చిన మీనిమం టైమ్స్ అమలుచేయాలని, 61 ఏళ్ల ఉద్యోగ భద్రత కల్పించాలని, మహిళలకు ప్రసూతి సెలవులు కల్పించాలని, ఉద్యోగి మరణించినా, పదవీవిరమణ పొందినా రూ.30లక్షల ఎక్స్ గ్రేషియో ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షులు శివనాయక్, ఐటీడీఏ ఇన్చార్జ్ రాజేష్, మహిళా అధ్యక్షులు రూపా, సీనియర్ నాయకులు నరేష్, వీరన్న, రవి సుజాత,నిర్మల,సునీత,వెంకటరమణ,రాము,బుచ్చయ్య,లక్ష్మణ్,నర్సింహారావు, నాగేశ్వరరావు, కృష్ణమూర్తి, రమేష్, జోహార్, బాబుసింగ్, నరేష్, జ్యోతి, నిర్మల, సుజాత తదితరులు పాల్గొన్నారు.





# కార్మికులను కష్టపెట్టిన ప్రభుత్వాలు కొనసాగిన చరిత్ర లేదు

### సిఐటియు పట్టణ కన్వీనర్ ఎంబి నర్సారెడ్డి

### రెండో రోజు కొనసాగిన పంచాయితీ కార్మికుల టోకెన్ సమ్మె



**భద్రాచలం టౌన్, డిసెంబర్ 28(ప్రజాజ్యోతి )**

గ్రామపంచాయతీ కార్మికులను ఇబ్బందులకు గురిచేసి పస్తులంచి ఏ ప్రభుత్వం కొనసాగిన చరిత్ర లేదని సిఐటియు పట్టణ కన్వీనర్ ఎం బి నర్సారెడ్డి అన్నారు. కనీస వేతనం ఉద్యోగ భద్రత కోసం సిఐటియు ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్మికులు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన సమ్మె రెండవ రోజు యధా విధంగా కొనసాగింది. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన సమ్మె శిబిరం వద్ద వివిధ రకాల నిరసనలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ కన్వీనర్ ఎంబీ నర్సారెడ్డి మాట్లాడుతూ సమాజంలో ఎవరూ చేయలేనటువంటి పనులను గ్రామ పంచాయతీ కార్మికులు ఎంతో ఇష్టంగా పని చేస్తున్నప్పటికీ వారి ఖాళీ కడుపుతో ఇబ్బందులు పెట్టడం సరైనది కాదని అన్నారు. సరైన వేతనం రాక అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ అప్పుల పాలవుతూ అనారోగ్యాల గురవుతూ అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పాలించిన ప్రభుత్వం కార్మికులను పట్టించుకోకపోవడం వలన ఆ ప్రభుత్వం మట్టి కొట్టుకుపోయిందని గుర్తు చేశారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పంచాయతీ కార్మికుల సమస్యలను పట్టించుకోకపోతే ఈ ప్రభుత్వానికి కూడా అదే గతి పడుతుందని హెచ్చరించారు. కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని ,ప్రమాద బీమా పథకాన్ని 10 లక్షలు చేయాలని అదేవిధంగా,పని భద్రత కల్పించాలని ,అధికారుల వేధింపులను ఆపాలని, డిమాండ్ చేశారు. అర్హులైన వారిని పర్మినెంట్ చేయాలని,తదితర డిమాండ్లతో కార్మికులు చేస్తున్న ఈ సమ్మెను ప్రభుత్వం అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకుని సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు. సమస్యలను పరిశీలించకపోతే రాబోయే కాలంలో నిరవధిక సమ్మె చేయటానికి కూడా వెనుకడమని హెచ్చరించారు. పంచాయతీ కార్మికుల న్యాయమైన పోరాటానికి ప్రజలు కూడా సంఘీభావాన్ని తెలియజేస్తున్నారని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి చర్చలకు పిలిచి వారి సమస్యలను డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని నర్సారెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ నాయకులు ఎన్.నాగరాజు ,ఏ రత్నం, మనోజ్ రెడ్డి, వీరన్న, విజయ, భాను,అనసూయ,సుశీల,ప్రసాద్ రెడ్డి పీ, భద్రమ్మ కార్మికులు పాల్గొన్నారు

## కార్మికుల సమ్మెను ఉధృతం చేస్తాం

### ప్రభుత్వాన్ని హెచ్చరించిన జేఏసీ

**జూలూరుపాడు, డిసెంబర్ 28(ప్రజా జ్యోతి )**



జూలూరుపాడు, మండలం..గ్రామపంచాయతీ కార్మికుల టోకెన్ సమ్మెలో భాగంగా జూలూరుపాడు ఎంపీడీవో కార్యాలయం ఎదుట దీక్షా శిబిరాన్ని సందర్శించి (ఏ.ఐ.టీ యూ. సి )జిల్లా అధ్యక్షులు కంచర్ల జమలయ్య, జిల్లా జేఏసీ నాయకులు, ఏదులాపురం గోపాలరావు, ఎండి యూసుఫ్, యాసా నరేష్ శనివారం సంఘీభావం తెలియజేశారు ఈ సందర్భంగా జేఏసీ నాయకులుమాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి గ్రామపంచాయతీ కార్మికుల జేఏసీ నాయకత్వాన్నిపిలిచి చర్చలు జరపాలని లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారుగ్రామ పంచాయతీ సిబ్బంది బకాయి వేతనాలు చెల్లించాలి. వేతనాలకు ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి. గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లించాలి 2వ పిఆర్ సి పరిధిలోకి గ్రామ పంచాయితీ సిబ్బందిని తీసుకురావాలి. జివో నెం:60 ప్రకారం వేతనాలు కేటగిరీల వారిగా చెల్లించాలి జీవో నెం.51 ని సవరించాలి. మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలి. పాత కేటగిరీలన్నింటినీ కొనసాగించాలి. కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయక కార్యదర్శులుగా నియమించాలి. అర్హులైన సిబ్బందికి ప్రమోషన్లన్నుకల్పించాలి పంచాయతీ సిబ్బందినందరికి ఉద్యోగ భద్రత కల్పించాలి. రీటైర్మెంట్ బెనిఫిట్ రూ. (ఐదు ) లక్షలు చెల్లించాలి. ఇన్సురెన్సు, ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలి. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలు చేయాలి పంచాయతీ సిబ్బందినందరిని పర్మినేంట్ చేయాలి. వేతనాలు పెంచాలిఆన్లైన్లో నమోదు కాని కార్మికుల పేర్లను నమోదు చేసి నేరుగా వారికి కూడ వేతనాలు చెలించాలి. పంచాయతీల అవసరాల ప్రతిపాధికన కార్మికుల సంఖ్యను పెంచాలికార్మికులందరికి ఇందిరమ్మ ఇండ్లు, ఇండ్ల సథలాలు కేటాయించాలిచనిపోయిన ఆనారోగ్యానికి గురైన కార్మికుల కుటుంబాల సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలి.

## ఎకరాకు 20 లక్షల పరిహారం

### గ్రామసభలో రైతులకు వివరించిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్

**జూలూరుపాడు, డిసెంబర్ 28 (ప్రజాజ్యోతి )**



జూలూరుపాడు మండల పరిధిలోని వినవా నగర గ్రామంలో సీతారామ కాలువ ద్వారా నష్టపోయిన బాధిత రైతులకు శనివారం తహసిల్దార్ కార్యాలయంలో గ్రామసభను ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమానికి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఇరిగేషన్ ఈఈ అర్జున్ రావు,డి చంద్రశేఖర రావులు స్థానిక తహసిల్దార్ తో కలిసి రైతులతో మాట్లాడారు. సీతారామ కాలువ ద్వారా నష్టం జరుగుతున్న మొత్తం రైతులు 28మంది , 28మంది రైతులకు సంబంధించిన మొత్తం భూమి 29.14ఎకరాలు. అందులో గిరిజనులు 24 మంది గిరిజనేతరులు నలుగురు ఉన్నారు . అయితే ప్రభుత్వం జీవో ప్రకారం గిరిజనులు గాని గిరిజన ఇతరులు గాని పట్టా భూమి అయితే 20 లక్షల పరిహారం ఇస్తున్నామని. ప్రభుత్వ భూములు అయితే గిరిజనేతరులకు 5లక్షలు గిరిజనులకు 20లక్షల పరిహారం ఇస్తున్నామని. ఐదు ఎకరాలకు పైన ప్రభుత్వ భూమి ఉంటే ఎలాంటి పరిహారం అందదని చెప్పారు. గిరిజన గిరిజనేతరులు అనే భేదం లేకుండా అందరికీ సమానంగా నష్టపరిహారం అందించాలని కొద్దిసేపు అధికారులతో వాగ్వాదానికి దిగారు అయితే అధికారులు మాత్రం ప్రభుత్వ జీవో ప్రకారం నష్టపరిహారం అందుతుందని ఒకవేళ నచ్చకపోతే రిప్రజెంటేషన్ ఇవ్వాలని సూచించారు అయితే 20 లక్షల నష్టపరిహారానికి రైతులందరూ సానుకూలంగా ఉన్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సీతారామ కాలువ బాధిత రైతులు ఆర్ఐ తిరుపతిరావు పాల్గొన్నారు.

# మన్మోహన్ సింగ్ కు ఘన నివాళులు



**ఇల్లందు, డిసెంబర్ 28, ప్రజాజ్యోతి:**

మండల మహిళా సమైక్య కార్యాలయంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (డిఆర్డిఏ) ఆధ్వర్యంలో మాజీ ప్రధాని దేశంలో కొత్త ఆర్థిక సంస్కరణలను సృష్టించి ఆర్థిక సంక్షోభం నుంచి దేశాన్ని కాపాడిన డా. మన్మోహన్ సింగ్ అకాల మృతికి శనివారం ఘన నివాళులర్పించారు. మన్మోహన్ సింగ్ చిన్న వయసులో తల్లి చనిపోవడంతో ఆ రోజుల్లో కిరోసిన్ దీపాల కింద విద్యనభ్యసించి అమృతసర్ యూనివర్సిటీ నుండి డిగ్రీ పూర్తి చేసి, క్రేమ్బ్రిడ్జి యూనివర్సిటీ నుండి పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఎకనామిక్స్, ఆక్స్ఫర్డ్ యూనివర్సిటీలో ఎకనామిక్స్ లో డిపిఎల్ పూర్తి చేసి వాణిజ్య మంత్రిత్వ శాఖలో సలహాదారుగా 1982లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ గా కొనసాగాలని పేర్కొన్నారు. అదే విధంగా ప్రణాళిక సంఘానికి డిప్యూటీ చైర్మన్ గా 1991లో యూజీసీ చైర్మన్ నియమించబడి విశిష్ట సేవలు అందించడం జరిగిందన్నారు. 1991లో తెలంగాణ ముద్దుబిడ్డ మాజీ ప్రధాని పీవీ నరసింహారావు క్యాబినెట్ లో ఆర్థిక మంత్రిగా బాధ్యతలు స్వీకరించి ఆర్థిక సంస్కరణలకు నాంది పలికి భారత ఆర్థిక వ్యవస్థను ఇద్దరు మహానుభావులు గాడిలో పెట్టడం జరిగిందని తెలిపారు. యూపీఏ ప్రభుత్వంలో ప్రధానమంత్రిగా 2004 నుంచి 2014 వరకు బాధ్యతలు స్వీకరించి పేద ప్రజలకు కావలసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, జాతియ ఉపాధి పథకం, అదేవిధంగా 2005లో ఆర్టిఐ, పలు పరిశ్రమల స్థాపన, పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందని కొనియాడారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావంలో తనవంతు సహకారం చేశారని, యూపీఏ ప్రభుత్వంలో భారత ఆర్థిక వ్యవస్థను కొత్త పుంతలు తొక్కించేందుకు అద్భుతమైన నాయకత్వాన్ని ప్రదర్శించి తాను ఒక నిపుణుడిగా, మార్గదర్శకుడిగా , గొప్ప మేధావి, ఆర్థిక సంస్కర్త, దేశ అభివృద్ధి కృషి చేసిన ఘనుడు అన్ని భారతదేశ ముద్దుబిడ్డ గా చరిత్రలో నిలిచిపోతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ఏపీడి రవికుమార్, ఎంపీడీఓ ధన్ సింగ్, ఏపియం దుర్గారావు, ఏవివో రమణ, అనూష, అంబుడ్స్ మేన్ నాగ ప్రకాష్, ఏపీవో శంకర్, ఈజీఎస్ ఉద్యోగులు, ఐకేపీ ఉద్యోగులు, నాగేంద్ర, భూలక్ష్మి, కొమ్మాలు, సంపత్, రామ్మూర్తి, రాంబాబు, లాలయ్య, నందకుమారి, సీఈఓ ప్రగతి మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్య కార్మికుల కుటుంబం పోషణకు ఇబ్బందులు



**పాల్వంచ, డిసెంబర్28(ప్రజా జ్యోతి ):**

గ్రామపంచాయతీ కార్మికులు 2019నుండి గ్రామాలలో పారిశుధ్యపనులు చేస్తూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతూ వారు మాత్రం చాలా సాలని జీతాలతో కుటుంబం పోషణకు కూడా ఇబ్బంది పడుతున్నారు పని భారం కూడా పెరిగింది నెలకు 9500మాత్రమే ఇస్తున్నారు, కనుక పారిశుధ్య కార్మికులకు శ్రమను గుర్తించాలని జి ఓ నెంబర్ 60 ప్రకారం వేతనం పెంచాలని మల్టి పర్పస్ విధానం రద్దు చేయాలనీ రిటైర్ మెంట్ బేనిపిట్స్ కల్పించాలని పెండింగ్ వేతనాలు చెల్లించాలని పి ఎఫ్, ఈ స్ ఐ భీమ సౌకర్యం కల్పించాలని కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాము, ఈ కార్యక్రమంలో పాల్గొన్న జేఏసీ నాయకులు, ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు బండి నాగేశ్వరావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు దొడ్డా రవి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ముత్యాల విశ్వనాధం, పంచాయతీ కార్మికు సంఘం జిల్లా కార్యదర్శి యూసఫ్, ఎఐటియుసి మండల అధ్యక్ష కార్యదర్శులు అన్నారపు వేంకటేశ్వర్లు, ఇట్టి వెంకట్రావు, సీఐటీయూ పట్టన కనినర్ కె సత్య సిపిఎం పట్టణ కార్యదర్శి తులసిరం, (టీ యు సి)నాయకులు వేల్పుల రమేశ్, శీలం భాస్కర్, ఏఐటీయూసీ మండల నాయకులు నిమ్మల రాంబాబు, స్క ఖరిమ్, సీఐటీయూ నాయకులు స్కె నిరంజన్, సోమలింగం, భాస్కర నారాయణ, పాల్గొన్న కార్మికులు పూర్ణ, లాంబ నాయక్, మమత, బాలకృష్ణ, వేంకటేశ్వర్లు, నరేష్, హరిబాబు, 20 కార్మికులు ధీక్షలో పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

### కార్మిక నాయకులు షేక్ జబ్బార్, నిమ్మల మధు



**ములకలపల్లి, డిసెంబర్ 28, ప్రజాజ్యోతి:**

గ్రామపంచాయతీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సిఐటియు మండల కన్వీనర్ నిమ్మల మధు, ఏఐటీయూసీ మండల కార్యదర్శి ఎస్కే జబ్బర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్మికుల టోకెన్ సమ్మె రెండో రోజు సంఘీభావంగా సిపిఐ, తెలుగుదేశం, పార్టీలు మద్దతు తెలియజేశాయి. సిపిఐ నాయకులు నరాటి రమేష్, తెలుగుదేశం పార్టీ నాయకులు చల్లా వెంకటేశ్వర్లు, మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికుల పోరాటానికి మా మద్దతు పూర్తిగా ఉంటుందని తెలియజేశారు. అనంతరం ఎంపీడీవో ఆఫీసు ముందు ధర్నా నిర్వహించి ఎంపీడీవో జి.రేవతి కి డిమాండ్లతో కూడిన మెమొరండం అందజేశారు. ఈ సందర్భంగా కార్మిక నాయకులు మధు, జబ్బర్ లు మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు గ్రామపంచాయతీ కార్మికులకు ఇచ్చిన వాగ్దానాలను వెంటనే అమలు చేసి రెండో పిఆర్సి పరిధిలోకి గ్రామపంచాయతీ కార్మికులను తీసుకురావాలని అన్నారు. పెండింగ్ లో ఉన్న జీతాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గ్రీన్ అంబాసిడర్లుగా తీసుకొన్న మహిళలను తొలగించే ప్రయత్నం మానుకోవాలన్నారు. మరణించిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలని అన్నారు. కార్మిక సమస్యలను పరిష్కరించని ఎడల 2025జనవరి 4తేదీ తర్వాత నిరవధిక సమ్మెకు సిద్ధం అవుతావని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) మండల కార్యదర్శి గంటా శ్రీనివాసరావు, వర్క రుక్మధరావు, ఏఐటీయూసీ మండల నాయకుడు గద్దల మహేష్, వాంకుడోత్ వీరు, నాయకులు బైటి అశోక్, పోక్కిలి నరేష్, ఒగ్గేల దారయ్య, గుగులోతు శంకర్, వెలకం రాఘవులు, బొమ్మగాని శంకర్, అనిల్, చాప వెంకటేష్, కణితి చిట్టిబాబు, పద్దం రమేష్, కొర్రి వీరాస్వామి, తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే తాటి



**మూలకలపల్లి, డిసెంబర్28, ప్రజాజ్యోతి:**

మండలంలోని ముత్యాలంపాడు గ్రామంలో జరిగిన తాటి మహేష్ కవిత దంపతుల కుమారులు జాషువా, మనోజ్,ల నూతన పట్టువస్త్రాలంకరణ వేడుకలో అశ్వారావుపేట, బూర్గంపాడు నియోజకవర్గ ల మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర మాజీ ట్రైకార్ చైర్మన్ తాటి వెంకటేశ్వర్లు హాజరై చిన్నారులను ఆశీర్వదించి, నూతన వస్త్రాలను అందజేశారు. ఆయన వెంట పోతుగంటి లక్ష్మణ్, తాటి రవి, మడకం విజయ్, తదితరులు ఉన్నారు.

# భద్రాద్రి రామయ్యకు స్వర్ణ తులసి పూజలు



**భద్రాచలం, డిసెంబర్ 28 (ప్రజాజ్యోతి ):**

భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో స్వామివారి ఉత్సవమూర్తులకు శనివారం అర్చకులు స్వర్ణతులసి పూజలు జరిపారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్యబలిహరణం తదితర నిత్యపూజలు చేశారు. అనంతరం స్వామివారి నిత్యకల్యాణమూర్తులను బేడా మండపానికి తీసుకువచ్చి నిత్యకల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న దాతలకు ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు. ఇదిలా ఉండగా ఆదివారం కృతిక దీపోత్సవం సందర్భంగా నిత్యకల్యాణం ఉండదని ఆలయ ఈవో రమాదేవి తెలిపారు.

# వాసు మెమోరియల్ స్మారక 18వ ఫుట్బాల్ టోర్నమెంట్ను




**పాల్వంచ, డిసెంబర్28(ప్రజా జ్యోతి ):**

కేటీపీఎస్ విద్యుత్ కళాభారతి గ్రౌండ్ నందు వాసు మెమోరియల్ స్మారక 18వ ఫుట్బాల్ టోర్నమెంట్ను శనివారం నాడు కేటీపీఎస్ ఓ అండ్ ఎం స్పోర్ట్స్ కార్యదర్శి మహేష్, మరియు పీలే శ్రీనివాసులు ప్రారంభించారు, ఈ పోటీల్లో మూడు జిల్లాల నుండి 11 టీంలు పాల్గొన్నాయి, ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ గత 18 ఏళ్లుగా వాసు మెమోరియల్ టోర్నమెంట్ను నిర్వహించడం అభినందించదగ్గ విషయమని శ్రీనివాస్ మిత్రబృందాన్ని అభినందించారు, రెండు రోజుల పాటు జరిగే ఆటల పోటీల్లో ప్రతి క్రీడాకారుడు పోటీ తత్వంతో, మిత్ర భావంతో ఆటలు ఆడి మంచి క్రీడాకారులుగా మెలగాలని పిలుపు ఇచ్చారు రామకృష్ణ ఆటల పోటీ నిర్వాహకులు ధనియాకుల రామకృష్ణ, ప్రవీణ్, సంజయ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# కల్తీ నర్సమ్మ చారిట్రబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వితరణ



**ఇల్లందు, డిసెంబర్ 8, ప్రజాజ్యోతి:**

కల్తీ నర్సయ్య చారిట్రబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని వేములవాడ గ్రామంలో ఎట్టి నరసమ్మ అనారోగ్యంతో మృతిచెందగా శనివారం వారి కుటుంబానికి డా. చీమల కోటేశ్వరమ్మ క్వింటా బియ్యం వితరణగా అందజేశారు. కల్తీ నర్సయ్య చారిట్రబుల్ ట్రస్ట్ నిర్వాహకురాలు డా. చీమల కోటేశ్వరమ్మ మాట్లాడుతూ నిరు పేదలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారికి తమవంతు సాయం చేస్తానని పేర్కొన్నారు. తన తండ్రి పుట్టిన ఊరిలో సేవ చేయడం అదృష్టమన్నారు. నిత్య కష్టాల్లో ఉండే ప్రజలకు కల్తీ నర్సమ్మ చారిట్రబుల్ ట్రస్ట్ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కల్తీ గంగరాజు, చీమల సాగర్ కుమార్, రామకోటి, మూతి బుచ్చయ్య, నవీన్, చీమల ప్రసాద్ డా. ఎస్వీఆర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.